# రేషన్ బండి.. ఇక రాదండి

- ఎండీయూ వాహనాలను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం
- రేషన్ కోసం షాపుల వద్ద క్యూ కట్టాల్సిందే



ఎండీయూ వాహనం వద్ద సరుకులు తీసుకుంటున్న కార్డుదారులు (ఫైల్)

**నరసాపురం రూరల్:** వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు మంచి చేస్తూ చేసిన కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం పథకం ప్రకారం తొలగిస్తోంది. రేషన్ దుకాణాల వద్ద సరుకుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేకుండా గత ప్రభుత్వం ఎండీయూ వాహనాలతో ఇంటింటికీ రేషన్ తీసుకొచ్చే వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి లభించింది. అయితే కూటమి ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ సరుకులు అందించే పథకానికి స్వస్తి పలికింది. ఇకపై కార్డు దారులు సరుకుల కోసం ప్రతినెలా చౌకదుకాణాల వద్దకు పాత రోజుల్లో తరహాలోనే పరుగులు పెట్టాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఐదేళ్లుగా ప్రజలకు సేవలందించిన ఎండీయూ వాహనాలు ఎక్కడిక్కడ నిలిచిపోనున్నాయి.

**రేషన్ దుకాణాల వద్ద నిరీక్షించాల్సిందే...**

కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో కార్డుదారులు గ్రామాల్లో రేషన్ దుకాణాల వద్ద నిరీక్షించాల్సి వస్తుంది. 2021 ఏప్రిల్ వరకు రేషన్ షాపుల వద్ద సరుకులు పొందేవారు. కొన్ని గ్రామాల్లో డీలర్లు లేక పోవడంతో పొరుగు గ్రామాలకు చెందిన డీలర్లు సరుకులు అందించేవాళ్లు. ఆ గ్రామస్తులకు డీలర్లు ఎప్పుడు ఇస్తే అప్పుడే సరుకులు తీసుకునే పరిస్థితి ఉండేది. పైగా సరుకుల పంపిణీలో అవకతవకలు చోటు చేసుకునేవి. దీంతో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలు సరుకుల కోసం షాపుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి లేకుండా ఉండేందుకు దేశంలో ఎక్కడా లేని రీతిలో ఇంటికే సరుకులు అందించేలా ఎండీయూ వాహన వ్యవస్థను తీసుకొచ్చారు.

**ఉపాధి కోల్పోనున్న ఎండీయూ ఆపరేటర్లు**

నరసాపురం నియోజవర్గంలో 41,656 కార్డులు ఉండగా 26 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. ఇంటింటి రేషన్ సరుకులు అందించే ఎండీయూ వాహన ఆపరేటర్ల ఉపాధిపై కూటమి ప్రభుత్వం దెబ్బకొట్టింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తీసు కున్న నిర్ణయంతో వీరంతా రోడ్డున పడాల్సి వస్తుంది. ప్రతి వాహనానికి ఆపరేటర్ తో పాటు హెల్పర్ ఉంటారు. వీరికి ప్రతి నెలా వివిధ రకాల వాటి కోసం ప్రభుత్వం రూ. 21 వేలు చెల్లించేది. జూన్ 1 నుంచి ఎండీయూ వాహన సేవలు మూలన పడనుండడంతో ఆపరేటర్లు, హెల్పర్లు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

### ప్రజలకు ఇబ్బందులు



ప్రభుత్వం ప్రజల్ని ఇబ్బందులు పెట్టే నిర్ణయాలు తీసుకోవడం సరికాదు. మా అమ్మతో కలిసి నేను ఉంటున్నాను. రేషన్ బండి రాకపోతే సుమారు రెండు కిలోమీటర్లు నడచి వెళ్లి సరుకులు తీసుకు రావడం మాకు కష్టం. చంద్రబాబు మాటలు నమ్మి ఓట్లేస్తే మాకు ఇస్తామన్న డబ్బులు ఇవ్వకపోగా ఇప్పుడు ఇలా ఇబ్బందులు పెట్టడం సరికాదు.

– మేడిది లక్ష్మి, సీతారామపురం సౌత్

### ఎండీయూ వాహనమే జీవనాధారం



ఎండీయూ వాహనం ద్వారా ఉపాధి పొందుతున్నాను. నాలుగేళ్ల నుంచి వాహనాన్ని నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. ప్రతి నెలా 15లోగా ఇంటింటికీ వెళ్లి సరుకుల పంపిణీ పూర్తి చేసే వాళ్లం. ప్రభుత్వం వాహనాలను రద్దు చేయడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. వీటిపై నాలానే ఎన్నో కుటుంబాలు ఆధారపడ్డాయి.

– గూడపాటి బాలాజీ,ఎండీయూ ఆపరేటర్, సారవ

### రద్దు చేయడం మంచిది కాదు



ప్రతి నెలా రేషన్ సరుకులు ఎండీయూ వాహనం ద్వారా ఇంటింటి వద్దకు వచ్చి ఇచ్చేవాళ్లు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని రద్దు చేయడం మంచిది కాదు. పల్లెల్లో ఈ సేవలు బాగా ఉండేవి. ప్రభుత్వం ఇప్పుడు తీసుకున్న నిర్ణయం వల్ల దూరంగా ఉన్న రేషన్ షాపులకు వెళ్లి అతి కష్టం మీద సరుకులు తెచ్చుకోవాల్సి ఉంటుంది.

– వర్ధనపు సుమలత, చిట్టవరం

### రేషన్ కష్టాలు మళ్లీ మొదలు



గత ఐదేళ్లుగా ఇంటి వద్దే రేషన్ తీసుకోవడం అలవాటు చేసుకున్నాం. అంతకు ముందు రేషన్ సరుకులు ఎప్పుడు ఇచ్చేవారో తెలిసేది కాదు. కూటమి ప్రభుత్వం పుణ్యమా? అని మళ్లీ రేషన్ కష్టాలు వచ్చాయి. నా భర్తకు అనారోగ్యం రేషన్ షాపు వద్దకు వెళ్లి గంటల తరబడి క్యూలో నిలుచోలేను. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఉన్నవి తీసేయడం దారుణం.

– కొర్లపాటి విమలకుమారి, చిట్టవరం

## క్లుప్తంగా

### అమ్మవారికి బంగారు ఆభరణాల సమర్పణ



అమ్మవారికి పూజలు చేస్తున్న దాతలు

**నరసాపురం:** పట్టణంలోని రాయిపేట శ్రీపుంతలోముసలమ్మ అమ్మవారికి మాజీ కౌన్సిలర్ మావూరి గిరజాపార్వతి, రవికుమార్ దంపతులు సుమారు 10 గ్రాముల బంగారంతో కళ్లు, కనురెప్పలు, బొట్టుబిళ్ల చేయించి అమ్మవారికి సమర్పించారు. ఈ నగలకు ఆదివారం అమ్మవారికి అలంకరించి ఆదివారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మిశెట్టి బాబ్జి, తాడి రాధాకృష్ణ, పోలిశెట్టి తాతారావు, లింగ్ రాంబాబు తదితరులు రవికుమార్ దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మావూరి సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు.

### నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

**నరసాపురం:** స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ(మీకోసం) కార్యక్రమం నిర్వహిస్తున్న నరసాపురం ఆర్డీఓ దాసి రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలు నుంచి కార్యక్రమంలో ప్రారంభం అవుతుందని వివరించారు.

### పెనుమంట్రలో ధ్యాన శిక్షణ



మణికుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

**పెనుమంట్ర:** స్థానిక పత్రీజీ ధ్యాన మందిరం వద్ద తణుకు పట్టణానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఓ.మణికుమార్ ఆదివారం ధ్యాన శిక్షణ అందించారు. భూపతిరాజు శ్రీనివాసరాజు, సాయిగీత దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మణికుమార్ మాట్లాడుతూ పత్రీజీ ప్రబోధించిన శ్వాస మీద ధ్యాస, ధ్యాన సాధనపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఆనందమయ జీవితం గడపాలంటే పరస్పర అవగాహనతో సాధ్యమవుతుందని వివరించారు. అనంతరం నిర్వాహకులు మణికుమార్‌ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, ఉపసర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు, రాధ, ఎన్. సుబ్బరాజు, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

### పెద్దిరాజుకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న కోలాటి చిన పెద్దిరాజు

**యలమంచిలి:** పాలకొల్లు పట్టణానికి చెందిన ప్రముఖ కవి, టెలికాం విశ్రాంత ఉద్యోగి, అంబేడ్కర్ వాది కోలాటి చిన పెద్దిరాజుకు మరో విశిష్టమైన గౌరవం దక్కింది. కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం కేంద్రంగా పనిచేస్తున్న కాంకార్డియా ఓపెన్ యూనివర్సిటీ పెద్దిరాజుకు డాక్టర్ ఆఫ్ డివినిటీ పురస్కారం అందజేసింది. తణుకులో ఆదివారం లూథరన్ చర్చి ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు బిషప్ జగ్జీవన్ మల్లిపూడి అధ్యక్షతన జరిగిన సభలో యూనివర్సిటీ ఛాన్సలర్ రెవరెండ్ బిషప్ రాబిన్ సన్ లూథర్ చేతుల మీదుగా పెద్దిరాజు గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ ఈ డాక్టరేట్ సమాజంలో తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.

### ధాన్యం కొనుగోలు చేయకపోవడం దారుణం

**నరసాపురం రూరల్:** అకాల వర్షాలతో రైతాంగం నష్టపోతున్నా ప్రభుత్వం టార్గెట్ లేదని ధాన్యం కొనుగోలు చేయకపోవడం దారుణమని ఏపీ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ధాన్యం అమ్మేందుకు రైతులు రైతుసేవా కేంద్రాలకు వెళ్తే అక్కడ అధికారులు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడంలేదు. ఇక్కడ సంచులు ఇవ్వము మీరే మిల్లర్ల వద్దకు వెళ్లి సంచులు తెచ్చుకొని అమ్ముకోవాలని చెప్పడం దారుణమని పేర్కొన్నారు. నరసాపురం డివిజన్‌లోని మల్లవరంలంక, మల్లవరం, సరిపల్లి, వేములదీవి, పెనుమదం, వద్దిపర్రు, గుమ్ములూరు, కాంబొట్లపాలెం తదితర గ్రామాల్లో సమస్య తీవ్రంగా ఉందని స్పష్టం చేశారు. తక్షణమే ప్రభుత్వ గోనె సంచులివ్వాలని జిల్లా జాయింట్ కలెక్టర్, నరసాపురం ఆర్డీఓ, జిల్లా పౌరసరఫరాల మేనేజర్, జిల్లా వ్యవసాయ అధికారులకు లేఖ రాశామని పేర్కొన్నారు.

### ప్రమాదంలో ఒకరికి గాయాలు

**భీమవరం:** ఒకటో పట్టణ పరిధిలో ద్విచక్ర వాహనంపై వెళుతుండగా లారీ ఢీ కొనడంతో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న మహిళకు గాయమైందని పోలీసులు తెలిపారు. భీమవరం నుంచి పంజా వేమవరం వెళుతుండగా ఈ సంఘటన జరిగిందన్నారు. ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### శ్రీరంగనాథరాజును కలిసిన హుస్సేన్‌బీబీ



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుతో హుస్సేన్ బీబీ

**పెనుగొండ:** మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజును రాష్ట్ర నూర్ బాషా ముస్లి మైనారిటీ సంక్షేమ సంఘ మహిళా అధ్యక్షురాలు షేక్ హుస్సెన్ బీబీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం తాడేపల్లిగూడెంలోని శ్రీరంగనాథరాజు నివాసంలో కలిసి ఇటీవల వైఎస్సార్ సీపీ అడ్వయిరీ కమిటీ సభ్యులుగా నియమితులైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆయన సూచించినట్లు స్థానిక విలేకరులకు తెలిపారు.

### దోషులను కఠినంగా శిక్షించాలి

**భీమవరం:** కడప జిల్లా మైలవరం గ్రామంలో నాలుగేళ్ల చిన్నారిని రేప్ చేసిన నిందితులను కఠినంగా శిక్షించి, ఉరి తీయాలని దళిత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ ఫౌండర్ కోనా జోసెఫ్, దళిత నాయకులు గంటా సుందర్‌కుమార్, కేసీ రాజు మాట్లాడుతూ నాలుగేళ్ల చిన్నారిపై ఇటువంటి దాడులు జరగడం దళిత సంఘాలు ఖండిస్తున్నాయని, నిందితులను కఠినంగా శిక్షించడమే కాకుండా ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈది రవికుమార్, టి.ప్రశాంత్, గతాల సందీప్, పిల్లి రవికాంత్, గెడ్డం జార్జ్, ఈది శేఖర్, ఆధార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రానికి కూటమి సర్కారు దాసోహం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**నరసాపురం:** కేంద్రానికి రాష్ట్రంలోని కూటమి సర్కార్ పూర్తిగా దాసోహం అన్న చందంగా పాలన సాగిస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్రత్యేక నిధులు, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అంశాల్లో ప్రధాని మోదీని నిలదీసే ధైర్యం కూటమి సర్కార్ చేయడంలేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిగా కేంద్రం వద్ద తాకట్టుపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యోగా డేకు ఇచ్చిన ప్రాధాన్యతను రాష్ట్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కేంద్రంలో కీలకంగా ఉన్న కూటమి ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోకపోవడం ఏంటి? అని ప్రశ్నించారు. కూటమి వైఖరిపై ప్రజా ఉద్యమాలు సీపీఎం చేపడుతుందని పేర్కొన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వేగవంతం చేస్తున్న మతోన్మాద, కార్పొరేట్ విధాలపై కూడా ఐక్య పోరాట క్రమాన్ని ఎంచుకోబోతున్నట్టు చెప్పారు. పహల్గామ్ దాడిలో ఎంతమంది ఉగ్రవాదులను పట్టుకున్నారో మోదీ ప్రభుత్వం ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, కవురు పెద్దిరాజు, డోకల లక్ష్మి అధ్యక్షవర్గంగా నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.బలరామ్, జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్, మంతెన సీతారామ్, ముచ్చర్ల త్రిమూర్తులు, ఎం.రామాంజనేయులు, జల్లి రామ్మోహన్, పాగాకు నారాయణరావు పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన పోరాటం ప్రారంభించాలి



గ్రామ కమిటీ నాయకులను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు

**యలమంచిలి:** ఎన్నికల హామీ అయిన సూపర్‌సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు విమర్శించారు.

అడవిపాలెం గ్రామంలో ఆదివారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడం ద్వారా పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని స్టాలిన్ బాబు కోరారు. అదే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వారి పక్షాన ప్రభుత్వంపై పోరాటం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకుని ఆమోదం కోసం జాబితాను పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇనుకొండ రవి, రాష్ట్ర దివ్యాంగుల ప్రధాన కార్యదర్శి బుంగా జయరాజు, తోట రామకృష్ణ , సిర్రా నాగరాజు, చుట్టుగుల్ల అప్పారావు, దొంగ రామకృష్ణ, దొంగ సుబ్బారావు, బోనం శ్రీ రంగనాయకులు, కసికోట శివ, పితాని బోస్, ఉన్నమట్ల నరేష్, పెచ్చెట్టి ఏడుకొండలు, యలమర్తి వెంకట రెడ్డి, గంజి నరసింహారావు, నక్కా శ్రీరాములు, సిర్రా సురేష్, బోనం ఆంజనేయులు, ఖండవల్లి బాబూరావు, పోలుకొండ ఏలీయా భక్తసింగ్, కుక్కల రామకృష్ణ, మల్లుల కొండ, పాలపర్తి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సరస్వతీ యజ్ఞం



సరస్వతీ యజ్ఞం చేస్తున్న తెలంగాణా వాసులు

**పెనుగొండ:** వాసవీ కన్యకపరమేశ్వరి జన్మస్థలమైన పెనుగొండలో తెలంగాణా వాసులు సరస్వతీ యజ్ఞం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి శ్రీలక్ష్మీ జనార్దన స్వామి కల్యాణ మండంలో జగిత్యాల, హన్మకొండ పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 504 మంది భక్తులు శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయంలోని మూలవిరాట్ వాసవీ మాతను, అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ ధాంలో మరకత శిల వాసవీ మాతను, 90 అడుగుల వాసవీ పంచలోహ విగ్రహాన్ని దర్శించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో సాయంత్రం వరకూ సరస్వతి యజ్ఞం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు.

## ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



నరసాపురం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



పెనుమంట్ర: మార్టేరులో యోగా చేస్తున్న విద్యార్థులు

**నరసాపురం:** నరసాపురం గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో ఆదివారం పిల్లలకు డ్యాన్స్, డ్రాయింగ్ అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. అలాగే పిల్లలతో యోగాసనాలు వేయించారు. తెలుగు టు ఇంగ్లిష్ ట్రాన్స్‌లేషన్, చెస్ వంటి ఆటలు నేర్పించారు. ప్రముఖ వ్యాఖ్యాత రెడ్డప్ప ధవేజీ కథలు, పద్యాలు ప్రాముఖ్యతను వివరించారు. రిటైర్డ్ శాస్త్రవేత్త ఆర్.సుబ్బారావు ఖగోళ అంశాలను వివరించారు. ఈ వేసవి విజ్ఞాన తరగతులు వచ్చే నెల 6 వరకూ జరుగుతాయని, విద్యార్థులు వినియోగించుకోవాలని లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి చెప్పారు.

**విద్యార్థులకు యోగాపై అవగాహన**

**పెనుమంట్ర:** మండలంలోని మార్టేరు శాఖా గ్రంథాలయంలో 27వరోజు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు మోడల్ స్టోరీలు, కథలతో గ్రంథాలయ అధికారి పీటీ శివకుమార్ అవగాహన కల్పించి, యోగాపై శిక్షణ ఇచ్చారు. యోగా ద్వారా మానసిక శారీరక ఆరోగ్యాన్ని పెపొందించుకోవచ్చని ఆయన విద్యార్థులు వివరించారు.

## రహదారులపైనే పశువుల సంచారం



పెనుగొండ ప్రధాన రహదారిలో రోడ్డుపైనే పశువులు

**పెనుగొండ:** పెనుగొండ ప్రధాన రహదారుల్లో పశువులు రోడ్లపైనే సంచరిస్తూ స్వైర విహారం చేస్తున్నాయి. గత కొంత కాలంగా పశువుల వ్యాపారులు దూడలను రోడ్లపైనే వదలి వేస్తుండడంతో వీటి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుంది. దీంతో పెనుగొండలో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా పాలివ్వని ఆవులను, దున్నపోతులను వదలడంతో ఇవి ప్రధాన బజారు నిత్యం పదుల సంఖ్యలో కలసి సంచరిస్తున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇవే స్పీడు బ్రేకర్లుగా ఆటంకం కల్పిస్తున్నాయి. వీటిల్లో కొన్ని ఒక్కోసారి పోటీ పడుతూ పొట్లాడుకున్న సమీపంలోని వ్యక్తులు సైతం గాయాలపాలవుతున్నారు. దూడల బేరగాళ్లు మొదట వీటిని రోడ్డుపై వదలివేసి, ధర పెరిగిన అనంతరం పశువధ శాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. రాత్రి వేళల్లో వీటిని అక్రమ రవాణా చేస్తున్నారన్నారు. వీటిని రోడ్లపైకి వదలకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### మహా స్థూపంలో సాయినామ పుస్తకాలు నిక్షిప్తం

**ఆకివీడు:** ఓం సాయి, శ్రీ సాయి, జయ జయ సాయి అంటూ ఆకివీడు ప్రాంతం సాయి నామంతో పునీతమైంది. పవిత్రోత్సవాల్లో భాగంగా స్థానిక గుమ్ములూరు సెంటర్‌లోని సాయిబాబా ఆలయంలో ఆదివారం కాకడ హారతి, అభిషేకాలు, సామూహిక సత్య వ్రతములుసత్సంగ ప్రసంగం జరిగాయి. తొలుత తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ సాయి కోటీశ్వర్ 100 అడుగుల స్థూపంలో ఐదు కోట్ల సాయి నామాలతో ఉన్న సాయి కోటి పుస్తకాలను భక్తులు నిక్షిప్తం చేశారు. ఈ పవిత్రోత్సవాలు ఆలయ నిర్వాహకులు, సాయి గురు కె.సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అఖండ అన్నసమారాధనకు వేలాది మంది హాజరయ్యారు.

## రాళ్ల చెరువు ఇన్‌లెట్ అస్తవ్యస్తం

**ఆకివీడు:** స్థానిక గుమ్ములూరు సెంటర్‌లోని రాళ్ల చెరువు ఇన్‌లెట్ బోదె అధ్వానంగా తయారైంది. యూటర్న్ తీసుకున్నట్లు ఇన్‌లెట్ బోదె అవుట్‌లెట్ బోదెగా మారిపోయి నీరు ఎదురు ప్రవహిస్తుంది. పంట బోదెలో వ్యర్థాలు పారవేయడంతో మురికి కూపంగా మారింది. ఎదురు ప్రవహించడంతో ఆ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలను ముంచి వేస్తుంది. ముగురుగు నీరు పంట కాలువలోకి చొచ్చుకు వెళుతుంది.

**పంట కాలువలో వ్యర్థాలు**

పంట కాలువలో వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర వ్యర్థాలను పారవేస్తున్నారు. రాళ్ల చెరువులోకి నీరు వెళ్లాలంటే పంట బోదెను తవ్వాల్సి ఉందంటున్నారు. పంట బోదె ప్రాంతం ఆక్రమణలకు గురి కావడంతో తవ్వకానికి కూడా వీలు లేకుండా ఉందని పలువురు వాపోతున్నారు. మురుగునీరు ఎదురు ప్రవహించడంతో సాయిబాబా ఆలయానికి వెళ్లే మార్గాన్ని ముంచెత్తుతుంది. దీంతో స్థానికులు, బాబా ఆలయానికి వచ్చే భక్తులు పలు ఇబ్బందులు పడుతున్నారు. పంట బోదె సమీపంలోని సాయిబాబా ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలకు వచ్చిన భక్తులు పంట బోదె ముంపు ప్రక్షాళన చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం పవిత్రోత్సవాల ముగింపు సందర్భంగా అఖండ అన్నసమారాధనలో పాల్గొన్న వేలాది మంది భక్తులు ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థానిక నగర పంచాయతీ శానిటరీ సిబ్బంది, ఇన్‌స్పెక్టర్ కనీస పారిశుద్ధ్య చర్యలు చేపట్టలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

## భక్తులతో పోటెత్తిన త్రిలింగ క్షేత్రాలు



నత్తారామేశ్వరంలో దర్శనానికి బారులు తీరిన భక్తులు



రామలింగేశ్వరునికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు



జుత్తిగలో క్షీరాభిషేకాలు చేస్తున్న దృశ్యం



అగస్త్యేశ్వరస్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

**పెనుమంట్ర:** వైశాఖ మాసం మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పెనుమంట్ర మండలంలో దక్షిణ కాశీ, రామేశ్వర క్షేత్రాలుగా పేరుగాంచిన నత్తారామేశ్వరం గ్రామంలో శ్రీఉమారామేశ్వరస్వామి, జుత్తిగలోని శ్రీఉమా వాసుకి రవిసోమేశ్వరస్వామి, మల్లిపూడిలో శ్రీఉమా అగస్త్యేశ్వర స్వామి ఆలయాల్లో ఆదివారం భక్తులతో పోటెత్తారు. మూడు ఆలయాలలో పంచలింగేశ్వరులను ఏకకాలంలో దర్శించుకునే అవకాశం సోమవారంతో ముగియనుండటంతో ఆదివారం మాసశివరాత్రిని పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో త్రిలింగ క్షేత్రాల్లో నత్తారామేశ్వరం గ్రామం గోస్తనీలో పరశురాముడు ప్రతిష్ఠించిన శ్రీఉమారామలింగేశ్వరస్వామి, సీతారాములు ప్రతిష్ఠించిన శ్రీఉమా రామేశ్వరస్వామి, లక్ష్మణ ప్రతిష్ఠ శ్రీఉమా లక్ష్మణేశ్వరస్వామి లింగాలతో పాటు జుత్తిగలోని శ్రీఉమాసోమేశ్వర స్వామి, మల్లిపూడిలో శ్రీఉమా అగస్త్యేశ్వరస్వామిలను రాష్ట్రంలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు ఏకకాలంలో దర్శించుకున్నారు. నత్తారామేశ్వరంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పులగం వేణుగోపాలరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. భీమవరంలో మావుళ్లమ్మ దేవాలయం కార్యనిర్వహణాధికారి, అసిస్టెంట్ కమిషనర్ నగేష్ రామేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో పలువురు దాతలు భక్తులకు అఖండ అన్నసమారాధన, మజ్జిగ, పానకం, చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. నత్తారామేశ్వరంలో ఆలయ ప్రధాన అర్చకులు రామేశ్వరపు రామలింగేశ్వరశర్మ, జుత్తిగలో వాసుశర్మ, మల్లిపూడిలో పుల్లేటికుర్తి నాగభూషణశర్మ ఆధ్వర్యంలో స్వామివార్లకు పంచామృతాభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు.